క్లుప్తంగా

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

అద్దంకి: మండలంలోని దస్తావేజు లేఖరులు శుక్రవారం పెన్‌డౌన్ ప్రకటించారు. సబ్‌రిజిస్ట్రార్ నవకుమార్‌కు సంఘ అధ్యక్షుడు ధర్మవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. దస్తావేజు లేఖరుల సమస్యల పరిష్కారం కోసం ఈ పెన్ డౌన్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ శాఖలో ఓటీపీ విధానంలో తలెత్తిన సాంకేతిక సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వీఆర్‌ఏల ధర్నా

అద్దంకి: వీఆఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. పదోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

డస్ట్ బిన్లు వినియోగించండి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో నివాసం ఉండే ప్రతి ఒక్కరూ డస్ట్ బిన్లను వినియోగిస్తూ చెత్తను పంచాయతీ ట్రాక్టర్లకే అందించాలని కార్యదర్శి మురళీ బాపూజీ సూచించారు. శుక్రవారం ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు చెత్తనుంచి సంపద కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. సమావేశంలో ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పాత కేసులపై కక్ష సాధింపులు?

అద్దంకి: కూటమి ప్రభుత్వ పాలనలో నాయకులు పాత కేసులను తిరగతోడి పోలీసులతో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను వేధింపులకు గురిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు అవిశెన ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం వాపోయారు. గతంలో జరిగిన గొడవకు సంబంధించి కొన్ని సంవత్సరాల తరువాత మరలా కేసును తిరగతోడి పోలీస్ స్టేషన్‌కు కొందరిని పిలిచి వేధిస్తున్నారన్నారు. దాంతో వారి కటుంబాలకు చెందిన వారు ఆదందోళనకు గురౌతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు లేవన్నారు. దీనిపై సీఐ సుబ్బరాజు మాట్లాడుతూ పాత కేసుల విషయంపై తాము విచారించడంలేదని.. తాజాగా జరిగిన ఘటనపై పిలిపించామన్నారు.

కూలీలందరికీ ఉపాధి కల్పిస్తాం

చీరాల టౌన్: వలసలను నిర్మూలించి కూలీలు అందరికీ ఉపాధి కల్పిస్తామని ఏపీవో దాసు పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీలో సచివాలయాల అడ్మిన్లు, డిజిటల్ అసిస్టెంట్లుతో కలిసి ఉపాధి పనుల సంఖ్య పెంపుదలపై సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా చర్యలు తీసుకుని ప్రతి కూలీకి జాబ్‌కార్డు అందించి ఉపాధి పనులకు వచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

కౌమార బాలికలకు పౌష్టికాహారం అవసరం

అద్దంకి: పట్టణంలోని కాకానిపాలెంలో శుక్రవారం పోషన్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ కౌమార బాలికలకు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. ఏ ఆహారం తీసుకోవాలో అవగాహన కల్పించారు. తరువాత మహిళలు చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

చీరాల రూరల్: రక్తదాన మాసోత్సవాల్లో భాగంగా ఇండియన్‌ రెడ్‌క్రాస్ సొసైటీ చీరాల సబ్‌డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో బార్ అసోసియేషన్ సహకారంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈమేరకు రెడ్‌క్రాస్ చైర్మన్ బూదరాజు శశికిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, మేరుగ రవికుమార్ శుక్రవారం తెలిపారు. రక్తదానంచేసి ప్రాణదాతలుగా నిలవాలని వారు కోరారు.

నూరు శాతం స్త్రీనిధి రికవరీలు చేయాలి

జె.పంగులూరు: గ్రూపుల నుంచి స్త్రీనిధి, వెలుగు, ఎస్సీఎస్పీ రీకవరీలు నూటికి నూరు శాతం ఉండాలని ఏపీఎం కోటేశ్వరావు అన్నారు. పంగులూరు వెలుగు కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ స్త్రీనిధి ఓడీ ఎక్కువగా పేరుకుపోయిందన్నారు. అనంతరం వీఓఏలకు బయోమెట్రిక్ మిషన్లు అందించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు మాధవి, స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్, సీసీలు సాల్మన్, చంద్ర, సురేష్ పాల్గొన్నారు.

బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పోలీసు తనిఖీలు

చీరాల అర్బన్: చీరాల ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో ఒన్‌టౌన్ సీఐ సుబ్బారావు, డాగ్ స్క్వాడ్, పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. గంజాయి అక్రమరవాణాపై తనిఖీలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. కొందరు రైలులో గంజాయిని అక్రమంగా తరలిస్తూ ఇటీవల చీరాల రైల్వేస్టేషన్ పట్టుబడిన నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

ఎత్తి పోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలి



కొరిశపాడులో పథకాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మేదరమెట్ల: మండల కేంద్రమైన కొరిశపాడులో నిర్మిస్తున్న యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. పథకానికి నిధులు కేటాయించేలా మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషి చేయాలని ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో చర్చించి పథకం నిర్మాణం చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. 2025 బడ్జెట్‌లో రూ. 8.5కోట్లు కేటాయించామని.. ఇప్పటి వరకు పథకం పనులు ప్రారంభం కాలేదన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ముకు మరికొంత సొమ్మును కేటాయించి తక్షణమే పథకం పనులను ప్రారంభించేలా మంత్రి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 2008 లో ప్రారంభించిన పథకం 2011కు పూర్తి కావాల్సి ఉండగా నేటికీ పూర్తికాలేదన్నారు. ఈ పథకం పూర్తి చేసుకుంటే రెండు మండలాలకు తాగు, సాగు నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. అంతేకాకుండా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని అలాగే ముంపునకు గురైనవారికి పునరావాసం కేటాయించలేదని ఇప్పటికైనా రైతులకు ఇవ్వాల్సిన పరిహారంతో పాటు పునరావాసం కల్పించాలని సీపీఎం నాయకులు కోరుతున్నారు. సీపీఎం నాయకులు మోంద్రు ఆంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.దశరథ, సీనియర్ నాయకులు కోటేశ్వరరావు, వై.రవీంద్రబాబు, సుధాకర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పనుల్లో పురుషుల భాగస్వామ్యం అవసరం



ఉప్పుటూరులో పోషకాహార ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది



చిమ్మిరి బండలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మ, డాక్టర్ విజయ



బల్లికురవ: పోషణ సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ

ఉప్పుటూరు (చినగంజాం): ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకొని అందరూ సంపూర్ణ ఆరోగ్య వంతులు కావాలని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. ఉప్పుటూరు పోషణ మహా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పోషకాహార వంటల పోటీలను సీడీపీఓ సుభద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో డాక్టర్ దాసరి చంద్రశేఖర్ హాజరయ్యారు. సుభద్ర మాట్లాడుతూ ఇంటి పనిలో పురుషులు కూడా భాగస్వామ్యం పంచుకుంటే ఇల్లాలిపై భారం తగ్గుతుందని తద్వారా మెరుగైన కుటుంబాలు నిర్మితమవుతాయన్నారు. డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 2 వరకు ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునంద, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్ శృతి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

మార్టూరు: ఉబకాయం వల్ల చురుకుదనం లోపించి అనారోగ్యానికి కారణమవుతుందని బాల్యంలోనే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ద్రోణాదుల మెడికల్ ఆఫీసర్ జె. పద్మజ అన్నారు. ద్రోణాదుల సెక్టార్ సూపర్‌వైజర్ కె.పద్మ ఆధ్వర్యంలో చిమ్మిరిబండ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషణ మహా కార్యక్రమంలో డాక్టర్ పద్మజ మాట్లాడారు. సర్పంచ్ జంపని నాగావర్ధిని, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు. వలపర్లలో సూపర్‌వైజర్ శిరీష ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

చీరాల అర్బన్: సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుముద్వతి అన్నారు. శుక్రవారం చీరాల తూర్పుకాపుల వీధి, శ్రీరాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మాట్లాడారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, వారు సరైన రీతిలో ఎదిగేందుకు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నాయన్నారు. ముందుగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చక్కెర, నూనె వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఏఎన్ఎం సత్యవేదం, ఐటీసీ ప్రతినిధి సుప్రజ, ఎంటి కుమారి, అంగన్‌వాడీ టీచర్లు ఇంద్రాణి, రోజా, గ్లోరి విజయకుమారి, ఆశ వర్కర్ శివపార్వతి, రాధా తదితరులు పాల్గొన్నారు.



చీరాల: అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బల్లికురవ: శిశు సంరక్షణలో తల్లితోపాటు తండ్రి పాత్ర అత్యంత కీలకమని ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీఓ డి. సుధ అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తండ్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భర్త తన భార్యకు పరీక్షలు చేయించడంతోపాటు, ఆరోగ్య సంరక్షణతో బిడ్డ పెంపకంలోనూ చేయూతనివ్వాలని చెప్పారు. సమతుల ఆహారాన్ని తీసుకోవాలని ఫాస్ట్‌ఫుడ్స్, తీసుకుంటే అనారోగ్యం పాలవుతారని వివరించారు. సూపర్‌వైజర్ సలోమి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణలో చీరాల డివిజన్ స్థాయి ఆటల పోటీలను డీఈఓ పురుషోత్తం శుక్రవారం ప్రారంభించారు. మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు డివిజన్ స్థాయిలో జరిగికే క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. డివిజన్ స్థాయి పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని సూచించారు. డిప్యూటీ డీఈఓ డి. గంగాధర్‌రావు, ఎంఈఓ జె. సుబ్బయ్య, పి. పురుషోత్తం, హెచ్ఎం తలమల దీప్తి, చెరుకూరి రాంబాబు, బండ్ల భారతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ పురుషోత్తం

లక్ష్యంతో చదివితే ఉన్నత భవిత

అద్దంకి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని జిల్లా పోలీస్ శిక్షణ అధికారి జి. రాధిక అన్నారు. శుక్రవారం పట్టణంలోని శింగరకొండ సమీపంలోని కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ వంటివి చేయకూడదన్నారు. వాటి వల్ల కొంత మంది విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును కోల్పోగా, ర్యాగింగ్‌కు గురైన కొందరు జీవితాలనే కోల్పోయారని గుర్తు చేశారు. కళాశాలల్లో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో గురువుల వద్ద విద్యను అభ్యసించాలని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడి జీవితాలను పాడు చేసుకోవద్దని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ వి. మోహనరావు, వివిధ శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధిక ఐపీఎస్

తిప్పతీగలో వ్యాధి నిరోధక శక్తి

వేటపాలెం: తిప్పతీగలో అనేక ఔషధ గుణాలు దాగి ఉన్నాయని, దీని ద్వారా వ్యాధి రోధక శక్తి వస్తుందని ఆయుర్వేద వైద్యులు సింధు పేర్కొన్నారు. అక్కాయి పాలెం పంచాయతీ లక్ష్మీపురంలో ప్రొటెక్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యం లో రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సౌజన్యంతో తిప్పతీగ, ఔషధ మొక్కల సాగుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ఔషధం ప్రతి కుటుంబానికి తప్పని సరిగా అవసరమని తెలిపారు. ప్రయోగాత్మకంగా తిప్పసత్తు తయారు చేసి రైతులకు చూపించారు. తిప్పతీగ వల్ల వాత కఫ దోషాలు పోతాయన్నారు. నల్లేరు, నేలవేము, నేల ఉసిరి, పల్వేరుగాయి, పునర్నవ వంటి ఔషధ మొక్కల ఉపయోగాల గురించి వివరించారు. కె. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి కుంటుంబ తిప్పతీగ మొక్కలను తమ ఇంటి పెరట్లో పెంచు కోవాలని సూచించారు. శవనం చంద్రారెడ్డి, గోపి, వనమిత్ర పోనాటి హరిప్రసాద్, ఎం. విజయ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యులు సింధు

బైక్‌ను ఢీకొన్న కారు.. దంపతులకు గాయాలు

అద్దంకి: బైక్‌ను కారు ఢీ కొన్న ఘటనలో దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన పట్టణంలోని నరసింహ స్వామి దేవస్థానం వద్ద శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు పట్టణంలోని పెరికపాలేనికి చెందిన ప్రసన్నాంజనేయులు, పార్వతి దంపతులు మేత మోపుతో పట్టణంలోకి వస్తున్నారు. ఈ క్రమంలో వారి బైకును నరసింహ స్వామి దేవస్థానం సమీపంలో కారు ఢీ కొట్టింది. స్థానికుల సమాచారం మేరకు వారిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

పూనూరు సొసైటీ అధ్యక్షునిగా వంకాయలపాటి



ప్రమాణ స్వీకారం చేస్తున్న వంకాయలపాటి వెంకటేశ్వర్లు, తదితరులు

యద్దనపూడి: మండలంలోని పూనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా వంకాయలపాటి వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు తీసుకున్నారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా భట్టు శ్రీనివాసరావు, కోటగిరి హనుమంతురావు ప్రమాణస్వీకారం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

నూరు శాతం అక్షరాస్యతకు కృషి చేయాలి



శిక్షకులకు మెటీరియల్ అందజేస్తున్న అధికారులు

ఇంకొల్లు(చినగంజాం): వయోజనులకు విద్యనందించడం ద్వారా నూరు శాతం అక్షరాస్యతను సాధించేందుకు కృషి చేయాలని వయోజన విద్య పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్ బాబు అన్నారు. డీఆర్‌డీఏ సీసీలు, వీఓఏలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వలంటరీ టీచర్లకు ఉల్లాస్ అక్షర ఆంధ్ర మండల స్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఇంకొల్లు వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనులకు దైనందిన కార్యక్రమాల్లో ఉపయోగపడేలా చదవడం, రాయడం నేర్పించేందుకు వయోజన విద్యాశాఖ కృషి చేస్తుందన్నారు. ఉల్లాస్ పథకంలో భాగంగా రాష్ట్రంలో 2029 నాటికి వంద శాతం అక్షరాస్యత సాధించాలనేదే లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించి చిత్తశుద్ధితో అమలు పరచి, నిరక్షరాస్యతను నిర్మూలించి, మండలంలో నూరు శాతం అక్షరాస్యత సాధించడానికి కృషి చేయాలని శిక్షణార్థులకు సూచించారు, అనంతరం శిక్షకులకు మెటీరియల్‌ను అందజేశారు. ఎంఈఓ శ్రీనివాసరావు, సీడీపీఓ సులోచన, ఏపీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మంపై అవగాహన

బల్లికురవ: హిందూ ధర్మం ఆచారా వ్యవహారాలు, సంప్రదాయాలపై ప్రజలకు గ్రామాల వారీగా అవగాహన కల్పిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మప్రచార ప రిషత్‌ఉమ్మడి ప్రకాశం జిల్లా అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలోని కొత్తపాలెం గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. చెన్నుపల్లి నాగేశ్వరరావు, మాదాల దానయ్య, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఇంకొల్లులో రక్తదాన శిబిరం

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు రోటరీ క్లబ్, బిస్మిల్లా హెల్ప్ హ్యాండ్ సహకారంతో ఇంకొల్లు రోటరీ గంగ ఆవరణలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం, అవయవదానం, నేత్రదానం చేయడం వలన తోటి మానవులకు ప్రాణదానం చేసినట్లేనని ఇంకొల్లు రోటరీ అధ్యక్షుడు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి ఆలవల రాఘవరెడ్డి, కోశాధికారి గోరంట్ల నాగేశ్వరరావు అన్నారు. సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, పోపూరి మోహనరావు, గిరి తదితరులు దాతలకు పండ్లు, శీతల పానీయాలు అందజేసి అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు. చీరాల ఏరియా వైద్యశాల బ్లడ్‌బ్యాంక్ వైద్యులు, డాక్టర్ షారుక్, డాక్టర్ రాజా శివం పాల్గొన్నారు.



ఇంకొల్లులో రక్తదానం చేస్తున్న దాతలు

మెడికల్ కళాశాలకు తరలిన నాయకులు

బల్లికురవ: బాపట్లలలో శుక్రవారం నిర్వహించిన మెడికల్ కళాశాల పోరు కార్యక్రమానికి బల్లికురవ మండలం నుంచి పలువురు తరలి వెళ్లారు. పార్టీ మండల సమన్వకర్త దేవినేని కృష్ణబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, రైతు విభాగం నాయకుడు మేడగం శ్రీనివాసరెడ్డి, యూత్ నయకుడు మక్కెన రవిబాబు, బీసీ సెల్ నాయకుడు ఆరుమూళ్ల సతీష్, ఎస్సీ, ఎస్టీ సెల్ ప్రత్తిపాటి అక్కులు, మూడావత్ హరికృష్ణనాయక్, కూకట్లపల్లి సర్పంచ్ ఇప్పల అయ్యప్పరెడ్డి, కొప్పెరపాలెం నాయకుడు గన్నమనేని వెంకటరామిరెడ్డితో పాటు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దంకి: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బాపట్లలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అద్దంకి నుంచి సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గునుపూడి రఘురామగుప్తా, మునిసిపల్ కౌన్సిలర్ కొత్తగోర్ల బాబు, నాయకులు యర్రా చౌదరి బాబు, నాగూర్‌వలి, ఖాదర్‌బాషా, వేలుపూరి మస్తాన్‌వలి, కొత్తపోలిరెడ్డి, వడ్లవల్లి ఆంజనేయులు, సంతమాగులూరు మండల జెడ్పీటీసీ అడివి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు, పార్టీ మండల అధ్యక్షుడు పూట్ల నాగేశ్వరరావు, నాయకులు సరేంద్ర, శివయ్య, రాణిరాజు, మందా కోటయ్య, కిన్నెర ఏసుబాబు, షేక్ బుజ్జి, ఇంకా వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, విద్యార్థులు తరలివెళ్లారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

మార్టూరు: మండలంలోని వలపర్ల ప్రభుత్వ బాలికల కళాశాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం అధ్యాపక బృందం యూనిఫారం పంపిణీ చేశారు. కళాశాలలోని 11మంది విద్యార్థినిలకు 15వేల రూపాయల వ్యయంతో సిద్ధం చేశారు. ప్రిన్సిపాల్ గని పిశెట్టి కళ్యాణి, రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల సుబ్బారావు అధ్యాపకులు పి. జాన్సన్, సయ్యద్ ఇమామ్ సాహెబ్, శ్రీనివాసరావు, జి. పోతురాజు, జి.భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు: గ్రామంలోని 12 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు శుక్రవారం ఒక్కోరికి రెండు జతల చొప్పున యూనిఫాం పంపిణీ చేశారు. గ్రామ అభివృద్ధి కోసం ఏర్పాటు అయిన గౌతమ బుద్ధ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. గ్రామానికి చెందిన అనిల్ గౌర స్మైల్ ఫౌండేషన్ సహకారంతో ఈ యూనిఫాంను అందించారని నిర్వాహకులు తెలిపారు. ఐసీడీఎస్ సిబ్బంది, సొసైటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

చీరాల అర్బన్: వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చీరాల 216 జాతీయ రహదారిపై తోటవారిపాలెం వద్ద చోటుచేసుకుంది. బాపట్లకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో వేటపాలెం వెళుతున్నారు. కర్లపాలెం మండలం కొత్తనందాయపాలేనికి చెందిన అట్ల అంజిరెడ్డి (54) చీరాల నుంచి బాపట్ల వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. కారులో ప్రయాణిస్తున్న వారి కుక్క డ్రైవర్‌పైకి దూకడంతో అతడు భయపడి స్టీరింగ్ వదిలేయడంతో కారు అదుపు తప్పి ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న అట్ల అంజిరెడ్డిని ఢీకొంది. దీంతో అతడు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. అలానే కారులో ఉన్న ఇద్దరికి గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఈపూరుపాలెం ఎస్సై ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

మండల మహాసభలను జయప్రదం చేయండి

అద్దంకి: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న అద్దంకి మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో శుక్రవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో మండల మహాసభలను పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కే బాషా, ఉపాధ్యక్షుడు జి. గణేస్, శిరోమని, తదిరతులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ఘనంగా బలరామ కృష్ణ జయంతి

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో కొలువై ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో భగవాన్ బలరామకృష్ణ జయంతి వేడుకలను భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బలరాముని ఆయుధమైన నాగలిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వేణుగోపాలునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కిసాన్ సంఘ్ గ్రామ అధ్యక్షుడు గన్నమనేని శివప్రసాద్, సెక్రటరీ గన్నమనేని లింగారావు, సభ్యులు బోయపాటి సుబ్బారావు, మండవ వెంకటేశ్వర్లు, గన్నమనేని చంద్రశేఖర్, బోయపాటి సాంబశివరావు, బత్తుల కిషోర్‌చంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



నాగలికి పూజ చేస్తున్న కిసాన్ సంఘ్ సభ్యులు

పలు కుటుంబాలకు మండల కన్వీనర్ పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మండల కన్వీనర్ వేణుబాబు

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రావూరి వేణుబాబు శుక్రవారం పరామర్శించారు. యద్దనపూడిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కవల వేణు ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఆయనను పరామర్శించి ప్రమాదం జరిగిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మరో కార్యకర్త బత్తుల వలి తల్లి మరియమ్మ అనారోగ్యానికి గురై మృతి చెందటంతో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాడ సానుభూతి తెలిపారు. యన్నం శ్రీను, పులగం చందు, గొర్రై సురేష్, నల్లపునేని లక్ష్మయ్య, వేణు, షేక్ బుడే, బొందు ప్రకాష్, వందనం పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనే ధ్యేయం

మేదరమెట్ల: సమాజంలో మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీసాగర్ పేర్కొన్నారు. కొరిశపాడు మండలం తిమ్మనపాలెం గ్రామంలో మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాల గురించిన కళాజాత, ర్యాలీ కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. మాదకద్రవ్యాలను విచ్చలవిడిగా వినియోగించడం వలన అనేక దుష్ప్రభావాలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ కేసులు లేకుండా ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని సూచించారు.



తిమ్మనపాలెం కళాజాత కార్యక్రమంలో కళాకారులు, హెల్ప్ సంస్థ ప్రతినిధులు